

మంత్రి సమక్షంలో పార్టీలో చేరిన నాయకులు



ప్రచారం చేస్తున్న జంగారెడ్డి తదితరులు

సంక్షేమమే గెలుపునకు నాంది

- కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి
- మంత్రి సబితారెడ్డి
- బీఆర్‌ఎస్‌లో చేరిక

కందుకూరు: బీఆర్‌ఎస్‌ విజయానికి కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని మంత్రి సబితారెడ్డి పిలుపునిచ్చారు. మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ ఎస్‌.సురేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్‌ సీనియర్‌ నాయకులు ఎ.మహేందర్‌రెడ్డి, కాకి దశరథ, శ్రీహరి ఆధ్వర్యంలో మండల పరిధిలోని గూడూరుకు చెందిన బీజేపీ నాయకులు ఎస్‌.రామకృష్ణ, ఎం.భిక్షపతి, ఎస్‌.పర్వతాలుతో పాటు పలువురు సోమవారం మంత్రి సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే మరోసారి గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. అభివృద్ధి చూసి పెద్ద ఎత్తున పార్టీలో చేరుతున్నారని తెలిపారు. ప్రతిపక్షాలకు ఓట్లు అడిగే హక్కు లేదని తేల్చిచెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ నాయకులు బాబయ్య, పారిజాతం, బలరామ్‌, దయ్యాల భీమేశ్‌, ఎ.శ్రీకాంత్‌రెడ్డి, నర్ల నర్సింహ, ఎండీ అలీ, చిందం శ్రీశైలం, కటికపల్లి సర్పంచ్‌ నరేందర్‌గౌడ్‌ పాల్గొన్నారు.

క్షత్రియులకు అండగా ఉంటా
మంత్రి సబితారెడ్డి

బడంగ్‌పేట్‌: క్షత్రియులకు అండగా ఉంటానని మంత్రి సబితారెడ్డి హామీ ఇచ్చారు. సోమవారం బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని తిరుమల గార్డెన్‌లో క్షత్రియ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సబితారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కారు గుర్తుకు ఓటు వేసి మరోసారి గెలిపించాలని కోరారు.

సబితారెడ్డి విజయం ఖాయం

కందుకూరు: మహేశ్వరంలో మరోసారి మంత్రి సబితారెడ్డి విజయం సాధించడం ఖాయమని జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం మండల పరిధిలోని బాచుపల్లిలో సబితారెడ్డికి మద్దతుగా గడప గడపకు వెళ్లి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి గెలుపు ఎప్పుడో ఖాయమయిందని, అత్యధిక మెజార్టీ కోసం ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ఆమె చేసిన అభివృద్ధి పథకాలే శ్రీరామ రక్షగా నిలుస్తాయని తెలిపారు. అందరూ కారు గుర్తుకే ఓటు వేసి తెలంగాణ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్‌ యాలాల శ్రీనివాస్‌, ఎంపీటీసీ గుండాల సురేశ్‌, బీఆర్‌ఎస్‌ మండల వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ మేఘనాథ్‌రెడ్డి, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు నర్సింహ, యూత్‌ అధ్యక్షుడు నరేశ్‌, పర్వతాలు యాదవ్‌, వెంకటేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఊట్లపల్లి, సార్లరావులపల్లిలో..

ఊట్లపల్లి, సార్లరావులపల్లిలో మాజీ ఎంపీపీ శోభ తన అనుచరులతో కలిసి సబితారెడ్డికి మద్దతుగా ప్రచారం చేశారు. కార్యకర్తలు పాల్గొన్నారు.

కేసీఆర్ హయాంలోనే గిరిజనుల అభ్యున్నతి



సభలో ప్రసంగిస్తున్న మంత్రి సత్యవతి రాథోడ్‌



సభనుద్దేశించి మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి

- తండాలను జీపీలుగా మార్చిన ఘనత సీఎందే
- సబితారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించండి
- గిరిజన, మహిళాశిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌
- ప్రతిపక్షాల మాటలు నమ్మి మోసపోవద్దు: మంత్రి సబితారెడ్డి



సబితారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన యువకులు

మహేశ్వరం: గిరిజనులను కాంగ్రెస్‌, బీజేపీ ఓటు బ్యాంక్‌గా చూశాయే తప్పా.. వారి అభివృద్ధి, సంక్షేమాన్ని ఏనాడూ పట్టించుకోలేదని గిరిజన, మహిళాశిశు సంక్షేమ శాఖా మంత్రి సత్యవతి రాథోడ్‌ ధ్వజమెత్తారు. సోమవారం మండల పరిధిలోని తుక్కుగూడలో బీఆర్‌ఎస్‌ పార్టీ ఆధ్వర్యంలో గిరిజన బంజారా ఆత్మీయ సమ్మేళన సభను మంత్రి సబితారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్‌ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యవతి రాథోడ్‌ మాట్లాడుతూ.. గిరిజనుల సంక్షేమానికి సీఎం కేసీఆర్‌ నిరంతరం కృషి చేశారని కొనియాడారు. ఎస్టీ సబ్‌ ప్లాన్‌ ద్వారా అధిక నిధులు కేటాయించి తండాలను అభివృద్ధి చేశారని గుర్తుచేశారు. 500 జనాభా ఉన్న తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసి గిరిజనులకు స్వయం పాలనాధికారాన్ని కల్పించారని ప్రశంసించారు. కొత్తగా ఏర్పాటైన తండాల్లో జీపీ భవనాల నిర్మాణం, సీసీ, బీటీ రోడ్లు, అండర్‌ గ్రౌండ్‌ డ్రైనేజీతో పాటు డ్వాక్రా, అంగన్‌వాడీ, పాఠశాల భవనాలను నిర్మించారని తెలిపారు. గిరిజనులకు ప్రభుత్వ పాలనను దగ్గరికి చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. అలాగే పోడు భూములకు పట్టాలిచ్చారని గుర్తుచేశారు. గిరిజనులు తలెత్తుకునేలా హైదరాబాద్‌ నడిబొడ్డున కోట్ల విలువ చేసే స్థలంతో బంజారా భవన్‌ను నిర్మించారని తెలిపారు. కారు గుర్తుకు ఓటు వేసి సబితారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని సత్యవతి రాథోడ్‌ అభ్యర్థించారు.

కారు గుర్తుకు ఓటేయండి

గిరిజనులను పట్టించుకోని కాంగ్రెస్‌, బీజేపీకి ఓటు వేసి వృథా చేసుకోవద్దని, కారు గుర్తుకు ఓటు వేయాలని మంత్రి సబితారెడ్డి విజ్ఞప్తి చేశారు. మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలో లంబాడీల ఆరాధ్య దైవం సంత్‌ సేవాలాల్‌ మహరాజ్‌, దుర్గమ్మ ఆలయ నిర్మాణాలకు రెండు ఎకరాల స్థలం కేటాయించామని, ఇంద్రారెడ్డి ట్రస్ట్‌ నిధులతో ఆలయాలను నిర్మిస్తున్నామని తెలిపారు. బంజారా భవన్‌కు స్థలం కేటాయించి భవన్‌ నిర్మాణం కోసం నిధులను మంజూరు చేయించామని గుర్తుచేశారు. అభివృద్ధి, సంక్షేమంలో గిరిజనులకు పెద్ద పీట వేస్తున్నామని తెలిపారు. మరోసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రతిపక్షాల మాటలు నమ్మి మోసపోవద్దని సబితారెడ్డి హెచ్చరించారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

పలు గిరిజన తండాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు మంత్రుల సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్‌ తీగల అనితారెడ్డి, బీఆర్‌ఎస్‌ గిరిజన రాష్ట్ర నాయకుడు దిప్‌లాల్‌ చౌహాన్‌, బీఆర్‌ఎస్‌ నియోజకవర్గ ఎస్టీసెల్‌ అధ్యక్షుడు సభావత్‌ లచ్చానాయక్‌, మండల పార్టీ అధ్యక్షుడు అంగోత్‌ రాజునాయక్‌, మండల ఎస్టీ సెల్‌ అధ్యక్షుడు గోపాల్‌నాయక్‌, ఉపాధ్యక్షుడు దేవులా నాయక్‌, గిరిజన సర్పంచ్‌లు రాజు నాయక్‌, శివ నాయక్‌, మోతిలాల్‌ నాయక్‌, నేజీ నాయక్‌, సాలీనాయక్‌, సేవాలాల్‌ ఆలయ కమిటీ అధ్యక్షుడు సీతారామ్‌ నాయక్‌, రవినాయక్‌ పలువురు పాల్గొన్నారు.

మహేశ్వరాన్ని హైటెక్‌ సిటీగా మారుస్తా

మహేశ్వరం: మహేశ్వరాన్ని మరో హైటెక్‌ సిటీగా మారుస్తామని మంత్రి సబితారెడ్డి ప్రకటించారు. మరోసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే.. నియోజకవర్గానికి భారీ పరిశ్రమలు తీసుకొచ్చి నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని కేసీ తండాకు చెందిన పలువురు యువకులు సర్పంచ్‌ మోతిలాల్‌ ఆధ్వర్యంలో సబితారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. మంత్రి మాట్లాడుతూ.. మహేశ్వరంలో విప్రో, మలబార్‌, సోలార్‌, టీవీ, సెల్‌ఫోన్ల తయారీ కంపెనీలను ఏర్పాటు చేశామన్నారు. భవిష్యత్తులో మరిన్ని పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. మహేశ్వరంలో గులాబీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

బాలల సైన్స్‌ కాంగ్రెస్‌లో విద్యార్థుల సత్తా



ప్రశాంస పత్రాలు అందుకుంటున్న విద్యార్థులు

బడంగ్‌పేట్‌: జాతీయ బాలల సైన్స్‌ కాంగ్రెస్‌ను హయత్‌నగర్‌ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించారు. బడంగ్‌పేట లార్డ్స్‌ ఒలంపియాడ్‌ విద్యార్థులు పాల్గొని సత్తా చాటారు. పాఠశాలకు చెందిన గోపిక, లిఖిత, లాస్య, మనోజ్‌గౌడ్‌ గృహ ప్రాంగణంలో చెట్ల పెంపకం, పర్యావరణ పరిరక్షణ అనే అంశాన్ని చక్కగా వివరించి ప్రశంసలు అందుకున్నారు. సోమవారం విద్యార్థులను ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో లార్డ్స్‌ విద్యాసంస్థల చైర్మన్‌ బీరప్ప, వైస్‌ చైర్మన్‌ శ్రీనివాస్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్‌ శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

శ్రీవిద్యకు డాక్టరేట్‌



పట్టా అందుకుంటున్న శ్రీవిద్య

బడంగ్‌పేట్‌: ఉస్మానియా యూనివర్సిటీలోని ఎలక్ట్రానిక్స్‌ అండ్‌ కమ్యూనికేషన్‌ ఇంజినీరింగ్‌ విభాగంలో అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న పుట్టి శ్రీవిద్య గౌరవ డాక్టరేట్‌ (పీహెచ్‌డీ) అందుకున్నారు. ఆర్టిఫిషియల్‌ ఇంటెలిజెన్స్‌ మరియు మెషిన్‌ లెర్నింగ్‌ అల్గారిథమ్‌లను ఉపయోగించి వైర్‌లెస్‌ సెన్సార్‌ నెట్‌ వర్క్‌ సెక్యూరిటీ మెరుగుదలలో కొత్త అల్గారిథమ్‌లను ప్రతిపాదించారు. ప్రొఫెసర్‌ ఎల్‌. నిర్మలాదేవి పర్యవేక్షణలో పరిశోధన చేశారు. తెలంగాణ గవర్నర్‌ తమిళిసై, వైస్‌ చాన్స్‌లర్‌ ప్రొఫెసర్‌ డి.రవిందర్‌, అడోబ్‌ చైర్మన్‌ శంతను నారాయణ్‌ చేతులమీదుగా పీహెచ్‌డీ పట్టాను అందుకున్నారు. సకాలంలో పీహెచ్‌డీ పూర్తి చేయడానికి సహకరించిన అధ్యాపకులు, ప్రొఫెసర్లకు బంధువులకు, స్నేహితులకు శ్రీవిద్య ధన్యవాదాలు తెలిపారు.

మూడు ఇళ్లల్లో చోరీ

కందుకూరు: తాళాలు వేసిన ఇళ్లల్లో దొంగలు చొరబడి రూ.1.40 లక్షల నగదుతో పాటు తులంన్నర బంగారం, పది కిలోల వెండి ఆభరణాలు దోచుకుపోయారు. ఈ ఘటన కందుకూరు పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. మండల పరిధిలోని లేమూరులో ఆదివారం రాత్రి తాళం వేసి ఉన్న పెండ్యాల అరుణ్‌ ఇంట్లో తులంన్నర బంగారం, రూ.25 వేల నగదును దొంగలు అపహరించారు. అదే విధంగా నిమ్మరాజుల నర్సింహ కుటుంబసభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లారు. తాళం పగలకొట్టి ఇంట్లో ఉన్న పది తులాల వెండి ఆభరణాలు, రూ.75 వేల నగదును ఎత్తుకెళ్లారు. అలాగే పెండ్యాల గోపాల్‌ ఇంట్లో ఓ గదిలో కుటుంబం నిద్రిస్తుండగా.. మరో గదిలో చొరబడ్డ దొంగలు రూ.40 వేలు దోచుకుని పరారయ్యారు. సోమవారం ఉదయం విషయాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందజేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఇంద్రసేనారెడ్డికి సత్కారం

ఆమనగల్లు: త్రిపుర గవర్నర్‌ నల్లు ఇంద్రసేనారెడ్డిని ఆమనగల్లు మున్సిపల్‌ చైర్మన్‌ రాంపాల్‌ నాయక్‌ ఘనంగా సత్కరించారు. కల్వకుర్తి పట్టణంలో సోమవారం జరిగిన కార్యక్రమానికి వచ్చిన గవర్నర్‌ ఇంద్రసేనారెడ్డిని రాంపాల్‌నాయక్‌ కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

బీఆర్‌ఎస్‌ను తరిమికొట్టండి

ఎల్‌బీనగర్‌ కాంగ్రెస్‌ పార్టీ అభ్యర్థి మధుయాష్కి



గడ్డిఅన్నారం డివిజన్‌లో పాదయాత్ర చేస్తున్న కాంగ్రెస్‌ పార్టీ అభ్యర్థి మధుయాష్కిగౌడ్‌

చైతన్యపురి: ఎల్‌బీనగర్‌ నియోజకవర్గాన్ని కరెప్షన్‌ ఫ్రీ, కబ్జా ఫ్రీగా తీర్చిదిద్దటమే తన లక్ష్యమని కాంగ్రెస్‌ పార్టీ అభ్యర్థి మధుయాష్కి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గడ్డి అన్నారం డివిజన్‌లోని కాలనీలలో ఆయన పాదయాత్ర నిర్వహించారు. అక్రమ సంపాదనకు ఆశపడి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తల్లిలాంటి కాంగ్రెస్‌ పార్టీకి ద్రోహం చేశారని విమర్శించారు. కాంగ్రెస్‌ పార్టీని గెలిపించి బీఆర్‌ఎస్‌ను తరిమికొట్టాలని ఓటర్లను ఆయన కోరారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఫ్లోర్‌లీడర్‌ దర్పెల్లి రాజశేఖర్‌రెడ్డి, నాయకులు మాజీ కౌన్సిలర్‌ బద్దుల వెంకటేశ్‌యాదవ్‌, డివిజన్‌ కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షుడు వేణుకుమార్‌ యాదవ్‌,యూత్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు కార్తీక్‌, మహిళానాయకులు, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల సందడి



నృత్యం చేస్తున్న చిన్నారులు

హస్తినాపురం: చదువుతో పాటు స్కిల్‌ డెవలప్‌మెంట్‌ ప్రోగ్రామ్స్‌ పై అవగాహన కల్పించి రాబోయే రోజుల్లో వాటి ప్రాముఖ్యతను విద్యార్థులు గుర్తుంచుకోవాలని రోటోమేకర్‌ వీఎఫ్‌ఎక్స్‌ మల్టీనేషనల్‌ కంపెనీ జనరల్‌ మేనేజర్‌ డాక్టర్‌ సూర్యప్రవీణ్‌ అన్నారు. సోమవారం హస్తినాపురం డివిజన్‌పరిధిలోని అనయ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్‌ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కొత్తగా కళాశాలలో చేరిన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ సీనియర్స్‌ ఈ వేడుక నిర్వహించారు. కార్యక్రమంలో అనయ కళాశాల చైర్మన్‌ పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్‌ శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

కసిరెడ్డి నామినేషన్‌ దాఖలు

ఆమనగల్లు: కల్వకుర్తి కాంగ్రెస్‌ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా కసిరెడ్డి నారాయణరెడ్డి సోమవారం నామినేషన్‌ దాఖలు చేశారు. కల్వకుర్తి మండల పరిషత్‌ కార్యాలయంలో రిటర్నింగ్‌ అధికారి శ్రీనుకు ఆయన నామినేషన్‌ పత్రాలు అందించారు. కడ్తాల మండలం మైసిగండిలోని మైసమ్మ ఆలయంలో కసిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కల్వకుర్తి పట్టణంలోని హనుమాన్‌ ఆలయంలో పూజలు, కల్వకుర్తి సమీపంలోని దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి, నాగర్‌కర్నూల్‌ జెడ్పీ వైస్‌ చైర్మన్‌ బాలాజీసింగ్‌, రాష్ట్ర కాంగ్రెస్‌ పార్టీ నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి, ఆమనగల్లు ఎంపీపీ అనిత, కల్వకుర్తి మాజీ సర్పంచ్‌ ఆనంద్‌కుమార్‌తో కలిసి కసిరెడ్డి నారాయణరెడ్డి నామినేషన్‌ దాఖలు చేశారు. ఆయనతో పాటు సోమవారం కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గానికి మొత్తం మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. కాంగ్రెస్‌ అభ్యర్థిగా కసిరెడ్డి, ఇండిపెండెంట్లుగా మాడ్గుల మండలం చంద్రాయణపల్లికి చెందిన హన్మదాస్‌, అచ్చంపేట మండలం లింగోటకి చెందిన ఆంజనేయులు నామినేషన్లు దాఖలు చేశారు.

అధికారంలోకి రాగానే ట్యాక్స్‌లు తగ్గిస్తాం



శ్రీరాములుకు మంగళ హారతులు పడుతున్న మహిళలు

- జనాభాకు తగ్గట్టుగా అభివృద్ధి లేదు
- బీజేపీ అభ్యర్థి అందెల శ్రీరాములు

బడంగ్‌పేట్‌: బంజారాహిల్స్‌, జూబ్లీహిల్స్‌ ప్రాంతాల్లో మాదిరిగా బడంగ్‌పేటలో ఇంటి ట్యాక్స్‌లు, నల్లా బిల్లులు ఉన్నాయని, బీజేపీ అధికారంలోకి రాగానే ట్యాక్స్‌లు తగ్గిస్తామని మహేశ్వరం నియోజకవర్గం ఆ పార్టీ అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్‌ ప్రజలకు హామీ ఇచ్చారు. బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని 6 డివిజన్లలో పలు కాలనీల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారానికి వచ్చిన అందెలకు బీజేపీ అభిమానులు, మహిళలు హారతులు పట్టారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ జనాభాకు తగ్గట్టుగా అభివృద్ధి జరుగలేదని విమర్శించారు. లక్షకుపైగా ఓటర్లు, రెండు లక్షలకుపైగా జనాభా ఉన్న బడంగ్‌పేటలో పెద్దాసుపత్రి లేకపోవడం దారుణమన్నారు. మంత్రి సబితారెడ్డి కాలనీల్లో డ్రైనేజీ, రోడ్లు అధ్వాన్నంగా ఎందుకు ఉన్నాయో చెప్పాలని ప్రశ్నించారు. డబుల్‌ బెడ్రూంలు, కొత్త రేషన్‌ కార్డులు ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో బీజేపీ కార్పొరేషన్‌ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, కొలన్‌ శంకర్‌రెడ్డి, సామ సంజీవరెడ్డి, గుర్రం మల్లారెడ్డి, నడికుడి యదగిరి, కార్పొరేటర్లు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

అందెల గెలుపు ఖాయం

హుడాకాంప్లెక్స్‌: మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ అందెల శ్రీరాములు యాదవ్‌ గెలుపు ఖాయమని, రాష్ట్రంలో అత్యధిక సీట్లు సాధించి బీజేపీ అధికారంలోకి వస్తుందని సరూర్‌నగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ ఆకుల శ్రీవాణి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం ఎంపీ బండి సంజయ్‌ నివాసంలో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా బండి సంజయ్‌, గోషామహల్‌ బీజేపీ అభ్యర్థి రాజాసింగ్‌ను సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గోషామహల్‌లో రాజాసింగ్‌ భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని జోస్యం చెప్పారు.



రాజాసింగ్‌ను సత్కరిస్తున్న శ్రీవాణి

ఇంటింటి ప్రచారం

పహాడీషరీఫ్‌: మామిడిపల్లి గ్రామంలో సోమవారం రాత్రి బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీజేపీ బడంగ్‌పేట్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ ఓబీసీ సెల్‌ అధ్యక్షుడు నరేశ్‌ యాదవ్‌ ఆధ్వర్యంలోని నాయకులు ఇంటింటికి తిరుగుతూ కమలం గుర్తుకు ఓటు వేసి అందెల శ్రీరాములు యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కోట్ల రంగనాథ్‌, నయీం, గణేశ్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

మహేశ్వరం కాంగ్రెస్‌లో ధిక్కారం!



జంగారెడ్డి

మహేశ్వరం: మహేశ్వరం నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా ఈ నెల 9న నామినేషన్‌ వేయనున్నానని పీసీసీ ప్రచార కమిటీ కార్యవర్గసభ్యుడు, మాజీ జెడ్పీ ఫ్లోర్‌ లీడర్‌ ఏనుగు జంగారెడ్డి ప్రకటించారు. సోమవారం ఆయన సాక్షితో మాట్లాడారు. మహేశ్వరంలో తనకు బలమైన క్యాడర్‌ ఉందని తెలిపారు. నిన్నా మొన్నటి వరకు కాంగ్రెస్‌ అధిష్టానం ప్రకటించిన మహేశ్వరం ఎమ్మెల్యే అభ్యర్థి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డితో కలిసి జంగారెడ్డి ఎన్నికల ప్రచారం చేశారు. ఇంతలోనే ఇద్దరి మధ్య ఏం జరిగిందో తెలియదు కానీ.. లక్ష్మారెడ్డిపై ధిక్కార స్వరం వినిపిస్తున్నారు. ఆయనకు మద్దతుగా ప్రచారం చేసి ఇప్పుడు స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికల క్షేత్రంలోకి దిగాలని నిర్ణయం తీసుకున్నారు. జంగారెడ్డి వేరు కుంపటి పెట్టడం వల్ల కాంగ్రెస్‌ ఓట్లకు గండిపడే ప్రమాదం లేకపోలేదు. మరి అధిష్టానం జంగారెడ్డిని బుజ్జగిస్తుందా లేకపోతే వదిలేస్తుందా అనేది వేచిచూడాలి. జంగారెడ్డి ప్రకటనతో కాంగ్రెస్‌ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బాలాపూర్‌కు రామమందిర అక్షింతలు

బడంగ్‌పేట్‌: అయోధ్య రామమందిరం నుంచి వచ్చిన అక్షింతలు సోమవారం బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని బాలాపూర్‌కు చేరుకున్నాయి. మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి అందెల శ్రీరాములు, హిందూ ధార్మిక సంఘాలు, స్థానికులు మహిళలు హారతులు ఇచ్చి పూజలు నిర్వహించారు.

మహేశ్వరంలో విజయం నాదే

- అధికారంలోకి వస్తే 'గ్యారంటీ'లు అమలు
- కాంగ్రెస్‌ అభ్యర్థి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి
- కాంగ్రెస్‌లో యువకులు చేరిక

మహేశ్వరం: మహేశ్వరం గడ్డపైన కాంగ్రెస్‌ పార్టీ మరోసారి విజయం సాధిస్తుందని మహేశ్వరం కాంగ్రెస్‌ అభ్యర్థి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం మండల పరిధిలోని దిలావార్‌గూడ, గాంధీనగర్‌ తండాలకు చెందిన పలు పార్టీలకు చెందిన నాయకులు లక్ష్మారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహేశ్వరం నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి బీఆర్‌ఎస్‌ ఇప్పటి వరకు గెలుపొందలేదని, రెండుసార్లు కాంగ్రెస్‌ అభ్యర్థులే గెలిచారని గుర్తుచేశారు. నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌ను ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. మహేశ్వరంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా అత్యధిక స్థానాలను దక్కించుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని జోస్యం చెప్పారు. 2018లో కాంగ్రెస్‌ పార్టీ నుంచి గెలిచిన మంత్రి సబితారెడ్డి, బీఆర్‌ఎస్‌ పార్టీలో చేరారని విమర్శించారు. కాంగ్రెస్‌ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని ప్రకటించారు. పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు చేరుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, కాంగ్రెస్‌ నాయకులు కృష్ణానాయక్‌, ఆవుల యాదయ్య, చంద్రమోహన్‌, ప్రవీణ్‌ పలువురు పాల్గొన్నారు.



లక్ష్మారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న యువకులు

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

దిల్‌సుఖ్‌నగర్‌: కాంగ్రెస్‌ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్‌ పార్టీ అభ్యర్థి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి (కేఎల్‌ఆర్‌) అన్నారు. సోమవారం మహేశ్వరం నియోజకవర్గం రామకృష్ణాపురం డివిజన్‌ చిత్ర లే ఔట్‌ కాలనీ పార్క్‌, ఆర్‌కేపురం పార్క్‌, హరిపురి కాలనీల్లో లక్ష్మారెడ్డి మార్నింగ్‌ వాక్‌ చేస్తూ.. ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం విఫలమైందన్నారు. అధికారంలోకి వచ్చిన వందరోజుల్లో ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ పార్టీ సీనియర్‌ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్‌ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి, పిట్ట హరినాథ్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

కందుకూరు: వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్‌ చైర్మన్‌ డి.చంద్రశేఖర్‌, వైస్‌ చైర్మన్‌ విజేందర్‌రెడ్డి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్‌ కార్యాలయంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ గ్రేడ్‌ రకం ధాన్యం క్వింటాళ్లకు రూ.2,203, సాధారణ రకానికి రూ.2,183 చొప్పున కొనుగోలు చేస్తున్నామన్నారు. రైతులు తాము పండించిన పంటను ఎండిన తర్వాత నేరుగా కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు శేఖర్‌రెడ్డి, నర్సింహ, అంజమ్మ, వెంకటేశ్‌, యశోద, చంద్రునాయక్‌, ఆనంద్‌, సీఈఓ యాదగిరిరెడ్డి, ఏసీఓ రాములు,సదానంద్‌గౌడ్‌ పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్‌ తదితరులు